ప్రజాశక్తి

ఆదివారం 18 మే 2025 | 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మలి విడత సమీకరణపై అయోమయం

అధికార ప్రకటన లేకుండా గ్రామసభలు

రైతులను ఒప్పించేందుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రయత్నాలు



అమరావతి మండలం నెమలికల్లు గ్రామసభకు హాజరు అయిన రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని విస్తరణలో భాగంగా మలివిడత భూ సమీకరణపై ఇంత వరకు అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. భూసమీకరణకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఇందుకు సంబంధించి మంత్రి వర్గంలో కూడా ఆమోదం తెలపలేదు. కానీ గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని రెండు మండలాల్లో భూ సమీకరణ పేరుతో గ్రామసభలు కొనసాగుతున్నాయి. తుళ్లూరు మండలంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అమరావతి మండలంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గ్రామ సభలు నిర్వహించి రైతులలో చర్చిస్తున్నారు. ఈ ప్రక్రియ గత 15 రోజులుగా కొనసాగుతోంది. అయితే ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేకుండా స్థానిక ఆర్‌డివో, తహశీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులతోకలిసి ఈసభలు నిర్వహిస్తున్నారు. రాజధాని విస్తరణలో భాగంగా మలివిడత 44 వేల ఎకరాల భూమి సమీకరణలో తీసుకుంటారని మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగానే ఈ సభలు జరుగుతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు,ప్రభుత్వ పెద్దలు ముందుగా ప్రజల నాడి తెలుసుకోండి.. తరువాత ఉత్తర్వులు వస్తాయని చెప్పడం వల్లే ఈసభలు జరుపుతున్నామని ఒక అధికారి వ్యాఖ్యానించారు. అయితే మునిసిపల్ మంత్రి పి.నారాయణ మాత్రం తమకు 10 వేల ఎకరాల భూమి అవసరం అని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయంకు 4,500 ఎకరాలు, వ్యాపార కార్యకలాపాలకు 2500 ఎకరాలు, రైల్వే లైను, ఇతర నిర్మాణాలకు మరో 3500 ఎకరాలు అవసరం అని ఆయన అంచనావేశారు. కానీ 44 వేల ఎకరాల సమీకరణపై మాత్రం ఇంత వరకు ఎటువంటి అధి కారిక ఉత్తర్వులు రాలేదు. తాడికొండ మండలం రావెల వద్ద విమానాశ్రయం నిర్మిస్తా

2లో



మాట్లాడుతున్న రైతు, కౌలురైతు, వ్యకాస నాయకులు



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

20న మండల, గ్రామ స్థాయిలో ఆందోళనలు

రైతు, కౌలురైతు, వ్యకాస సమస్యలపై నిరసనలకు సంఘాల నాయకుల పిలుపు

మండల కేంద్రాల్లో నిరసనలకు కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈనెల 20న గ్రామాలు, మండల కేంద్రాల్లో జరిగే నిరసనలు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావులు పిలుపునిచ్చారు.శనివారం బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు పంటలు పండించటానికి ప్రభుత్వాల నుండి తగిన సహకారం దక్కట్లేదన్నారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర కూడా లభించట్లేదన్నారు. దీంతో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మిర్చికి ఈ ఏడాది రెండున్నర లక్షల రూపాయలకు పైగా ఖర్చు అయితే లక్షన్నరే ఆదాయం వచ్చిందన్నారు. దాన్యం రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావట్లేదన్నారు. అపరాల రైతులూ అదేపరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రత్యామ్నాయ పంటగా పొగాకును సాగు చేశారని, కంపెనీలో పొగాకును కొనుగోలు చేయకపోవటంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నారు. గత సంవత్సరం కింటాల్ రూ.20వేలు ఉంటే ఈ ఏడాది మూడు నుండి నాలుగు వేలు అంటూ...కొనుగోలుకు కూడా ముందుకు రావట్లేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయట్లేదని, వేతనాలు సకాలంలో విడుదల కావట్లేదన్నారు. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవట్లేదన్నారు. రాజధాని ప్రాంతంలో సారవంతమైన భూమి 33వేల ఎకరాలు కనుమరుగైందని, ఇప్పుడు మరో 50వేల ఎకరాలు తీసుకోవటానికి ప్రయత్నం

2లో

పిఎస్ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

ఘనంగా ప్రారంభమైన కబడ్డీపోటీలు



తలపడుతున్న జట్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కమ్యూనిస్టు యోధుడు పుచ్చల పల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం కబడ్డీ పోటీలను చిలకలూరిపేట తూర్పు మాలపల్లిలో ప్రారంభించారు. క్రీడాపోటీలకు ముఖ్య అతిధులుగా పిఎన్ఎం నాయకులు ఎన్ కాళిదాసు, ప్రముఖ పిల్లల వైద్యు నిపుణులు డాక్టర్ కొల్లా అమర్‌నాథ్, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, సిఐ టియు నాయకులు పేరు బోయిన వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మొల్ రెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో 18 టీమ్‌లు వచ్చాయని, శనివారం 6టీమ్‌లు తలపడ్డారని నిర్వాహకులు తెలిపారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన ప్రారంభ

2లో



పోటీలు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ అమర్‌నాథ్

అక్రమ అరెస్టులకు బెదరం : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అక్రమ కేసులు ద్వారా తమ పార్టీని బలహీన పర్చాలన్న కూటమి ప్రభుత్వ ఎత్తుగడలు ఫలించవని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం ఆయన తన కార్యాయలంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం నాటి అంశాల్లో ఇప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. అక్రమ కేసులు పెడితే ఏ పార్టీ బలహీన పడదన్నారు. చంద్రబాబును గతంలో తాము అరెస్టు చేస్తే ఆ పార్టీ ఎన్నికల్లో గెలవలేదా... గతంలో వైఎస జగన్‌ను అక్రమ కేసులతో చంద్రబాబు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి 16నెలలు జైలులో ఉంచి తాము బలహీనపడ్డామా అని ప్రశ్నించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని తాము మరింత బలపడతామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిందేమీ లేదని అభివృద్ధి సంక్షేమ పథకాలను విస్మరించి ప్రజలను మభ్య పెట్టే పాలన, కక్ష సాధింపు ధోరణి, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును అరెస్టులో కీలక పాత్ర పోషించిన అధికారులందరినీ జైలుకు పంపుతున్నారని తెలిపారు. గతప్రభుత్వ హయంలో పనిచేసిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులందరీనీ వేధిస్తున్నారని, అక్రమ కేసులతో జైలుకు పంపుతున్నారని అన్నారు. మద్యం కేసులో వైఎస్‌జగన్‌ను అరెస్టు చేస్తారన్న వార్తలపై ఆయన స్పందిస్తూ అరెస్టులకు భయం పడటం తమపార్టీలో లేదన్నారు. టిడిపి ఎంత వేధించినా ఎవ్వరం బెదిరేది లేదన్నారు.



తులసీ ప్రభుకు ఒప్పందపత్రాలు అందిస్తున్న పెమ్మసాని

జిజిహెచ్‌లో మెరుగ్గా వైద్య సేవలు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని వైద్యసేవలపై రోగుల సంతృప్తి స్థాయిని మరింత మెరుగ్గా ఉండేలా చూడాలని అందుకు పటిష్ట ప్రణాళిక రూపొందిం చాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని నాట్కో సెంటరు సెమినార్ హాలులో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. శంకరవిలాస్ ఆర్వోబీ రహదారి విస్తరణలో భాగంగా ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఇతర గదులను పక్కకు మార్చేందుకు నగరపాలక సంస్థ, విధ్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు ఆర్థిక సహాయంతో నిర్మించనున్న సర్వీస్ బ్లాక్ పనులు వెంటనే ప్రారంభించేలా ఇంజనీరింగ్ అధికారులు తుది ప్లానులో మార్పులు లేకుండా మరోసారి నిర్మాణ ఏజెన్సీతో కలిసి పరిశీలించాలన్నారు. పొదిలిప్రసాద్ అత్యవసర విభాగంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో వరద నీరు చేరకుండా నిపుణుల సలహాలు తీసుకొని అవసరమైన పనులు వెంటనే చేపట్టాలన్నారు. జిజిహెచ్‌లో ఈ-ఆఫీస్ అమలుకు అవసరమైన కంప్యూటర్లు సాఫ్ట్ వేర్‌కంపెనీల సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులులేకుండా ఆసుపత్రులలో ప్రైవేటు వ్యక్తులు అన్నదానాలు చేయటం వలన పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నందున, ప్రస్తుతం అసుపత్రిలోమధురాన్నం ట్రస్ట్ ద్వారా జరుగుతున్న అన్నదానం మినహా మిగిలిన వారుఅన్నదానం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ నుఆదేశించారు. దాతలు అండగా

2లో



ఘనంగా ప్రారంభమైన కబడ్డీపోటీలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో పిఎన్ఎం నాయకులు నూతలపాటి కాళిదాసు మాట్లాడుతు క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని, పోటీ తత్వాన్ని ఇస్తా యన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా జరుగుతున్న ఈ పోటీలు ఉద్యమ స్ఫూర్తినిస్తాయి అన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారున్ని పే రు పేరునా అభినందించారు. ఈ పోటీలకు అంపైర్‌గా అనిల్‌కుమార్, నాగేంద్రబాబు వ్యవహరిస్తారని, న్యాయ నిర్ణేతలుగా సాతులూరి సురేంద్ర, సాతులూరి హనుమంతరావు, ప్రకాష్, బెంజిమెన్ వ్యవహరిస్తారన్నారు.ఆటకు 40 నిముషాల పరిమితి ఉందని, స్థానిక తూర్పు మాలపల్లి లోని చంద్రమౌళి పార్క్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రి మ్యాచ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి జట్టులో 12 మంది క్రీడాకారులు మాత్రమే ఉండా లని, ఒక జట్టులో క్రీడాకారుడు మరో జట్టులోఆడేం దుకు వీలు లేదన్నారు. క్రీడాకారుడు 85 కేజీల బరువు మిం చరాదని తెలిపారు. విజేతలకు 19 వ తేదీన నిర్వహించ నున్న కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి సభలో ప్రథమ బహు మతిగా రూ.20000 ద్వితీయ బహుమతి రూ.15000 తృతీయ బహుమ తి రూ.10000 నాలుగవ బహుమతిగా రూ.5000 అంద జేయనున్నట్లు పేర్కొన్నారు ముందుగా ఐటీసీ పొగాకు ఉద్యమ నాయకులు 25 మందిని స్మరించుకుంటు పూలతో ఘన నివాళ్ళు అర్పించారు. అనంతరం నాయకు లు క్రీడాకారులగా పాల్గొని క్రీడాకారులకు ఉత్సాహ పరిచారు.

జిజిహెచ్‌లో మెరుగ్గా వైద్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

సహాయం చేయాలంటే ఆస్పత్రికి అవసరమైన ఇతర పరికరాలకు నిధులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోసిసిటీవీ కెమేరాల ద్వారా నిరంతరం పటిష్టంగా పర్యవేక్షణ చేయటంతోపాటు పారిశుధ్యం లోపం, ఇతర సంఘటనపై బాధ్యులను గుర్తించి చర్యలుతీసుకునే విధానంను అమలు చేయాలన్నారు. వైద్యులు, ఇతర సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించటంతో పాటు, నిర్లక్ష్యం లేకుండా వైద్యసేవలు అందించేలా పర్యవేక్షించాలని, నిబంధనలు పాటించని వారిపైచర్యలు తీసుకోవాలన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటరులో ప్రస్తుతం ఉన్న120 పడకలతో పాటు అదనంగా మరో 150 పడకలకు విస్తరిస్తున్నందునప్రభుత్వం కాన్సర్ చికిత్స లెవల్ 1 ఆసుపత్రిగా గుర్తించిందన్నారు. అదేవిధంగా నాట్కో కాన్సర్ సెంటరులో మరో 30 రోజుల్లో పెట్ స్కాన్ నుప్రారంభించనున్నందున దీనికి అవసరమైన సాంకేతిక సిబ్బందినినియమించుకోవటానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్డియాలజీ విభాగంలో ఈసీజీ, ఓసీటీ మిషను ఏర్పాటుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులను సంప్రదించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లో జరుగుతున్న అవకతవకలు, మార్చురీ వద్ద రోగుల నుంచి నగదు వసూలుపై విచారించి ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సర్వీస్ బ్లాక్ ను రూ.10 కోట్లుతో నిర్మించనున్న తులసీ రామచంద్ర ప్రభు కు ఎంఎయు పత్రాలను మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ తేజ, శాసనసభ్యులు మహమ్మద్ నజీర్, బూర్ల రామాంజనేయులుతో కలిసి అందించి ఆసుపత్రి తరుపున ఘనంగా సన్మానించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వీ రమణ ప్రచురించిన జీజీహెచ్ సుఖీ భవ సమాచార దర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశం అనంతరంపెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన ఏసీలు సమకూర్చటం, రహదారి విస్తరణ వలన తొలగించిన నిర్మాణాలపున:ర్ నిర్మించటం, పొదిలి ప్రసాద్ బ్లాక్ లో అత్యవసర మరమ్మతు పనులపై చర్చించటం జరిగిందన్నారు. ఈ-హాస్పటల్ కు సంబంధించి అవసరమైన కంప్యూటర్లు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తులసి రామచంద్ర ప్రభు నిర్మించనున్న సర్వీసు బ్లాక్ కు కూడా త్వరలో శంస్థాపన చేయబోతున్నామన్నారు.

మలి విడత సమీకరణపై అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

_రని ప్రచారం జరగడంతో సినీనటుడు బాలకృష్ణ కంపెనీ క్లాసిక్ ఇన్ఫో ప్రతినిధులతో సహ పలువురు తాడికొండ, మేడికొండూరు మండలాల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారు. అయితే తాజా సమాచారం ప్రకారం రావెల వద్ద భూమి అనువుగా లేదని పెదకాకాని మండలంలో ఏర్పాటు చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. దీంతో భూములు కొనుగోలు చేసిన పలువురు తాము నష్టపోతామని ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన వైకుంఠపురం, పెదమద్దూరు, కర్లపూడి, యండ్రాయి తదితర గ్రామాల్లో గ్రామసభలను పూర్తి చేశారు. తాజాగా అమరావతి మండలంలో అమరావతి, ధరణికోట, ఉంగుటూరు, నెమలికల్లు, మండేపూడి, నరుకుళ్లపాడు, లింగాపురం, ముత్యాలపాలెం, దిడుగు, పొందుగల, పెదకూరపాడు మండలం బలుసుపాడు, కంభం తదితర గ్రామాలను భూ సమీకరణకు ఎంపిక చేశారు. శనివారం పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నెమలికల్లు, ఉంగుటూరు, నరుకుళ్లపాడు, మండెపూడి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. నరుకుళ్లపాడులో కొంత మంది సమీకరణకు విముఖత చూపగా మిగతా మూడు గ్రామాల్లో పలు విజ్ఞాపనలతో రైతులు సుముఖత వ్యక్తం చేశారు. తమకు కూడా 29 గ్రామాల పరిధిలోనే రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని, కౌలు తక్షణం రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్‌లు తెరపైకి తెచ్చారు. అలాగే 2015లో నిర్వహించిన భూ సమీకరణలో మినహాయించిన వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాలపై ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ దృష్టి సారించారు. వడ్డమానులో ప్రధాన రైల్వే స్టేషన్ ఏర్పాటు అవుతుందని చెబుతున్నారు. రైల్వే లైను కోసమే భూ సమీకరణ గ్రామసభ అని బ్యానర్‌తోనే అభిప్రాయసేకరణ చేశారు. తాడికొండ ప్రాంతంలో ఇప్పటికే భారీగా ధరలు పెరిగి ఉండటంతో ఎక్కువ మంది రైతులు సమీకరణలో భూములు ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తాడికొండలో పరిమితంగా సమీకరణ చేసి అమరావతి మండలం వైపు దృష్టి సారించింది. అయితే రాజధాని అమరావతిలో 10 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములకే ఇంతవరకు రిటర్నబుల్ ప్లాట్లు తమ చేతికి అందలేదని ఈదశలో మరో విడత సమీకరణలో భూములు ఇస్తే ఎప్పటికి తమకు దక్కుతాయన్న ఆందోళన అమరావతి, తాడికొండ మండలాల రైతుల్లో నెలకొంది. రాజధాని విస్తరణ ప్రతిపాదనపై అధికారిక ప్రకటన కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

20న మండల, గ్రామ స్థాయిలో ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న జరిగే నిరసన కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా జిల్లా కేంద్రం గుంటూరులోనూ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్మిక సంఘాల నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

దేశ వ్యాప్తంగా ఈనెల 20న తలపెట్టిన సమ్మెను దేశంలో నెలకొన్న అననుకూల పరిస్థితుల కారణంగా రద్దు అయ్యిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అయితే అదే రోజు అన్ని మండల కేంద్రాల్లో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. శనివారం కార్మిక సంఘాల సమావేశం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, ఏపీఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ 20న గుంటూరులో ఉదయం 10 లాడ్జి సెంటర్ నుండి శంకర్ విలాస్ సెంటర్ వరకూ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని చెప్పారు. లేబర్ కోడ్‌ల వల్ల సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె హక్కు, ఇతర అనేక హక్కులు కోల్పోతామన్నారు. కావున కార్మికులు రాబోయే కాలంలో జరిగే పోరాటాలలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.



సమ్మె శిబిరంలో కూర్చున్న ఉద్యోగులు

20వ రోజుకు చేరిన సిహెచ్ఒ సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంతో 20వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ పి.లింగరాజు, ట్రెజరర్ కె.సంధ్య మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కాలేదని, అనివార్య పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 23 శాతం వేతన సవరణ తదితర ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం అసోసియేషన్ నాయకులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని జిల్లా అధ్యక్షులు టి.ప్రవల్లిక తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షరాలు జి. వనజ, నాయకులు మేరీ పుష్ప, దివ్య, స్వాతి, మౌనిక జహీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న కొమ్మాలపాటి

మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి పెదకూరపాడు

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని టిడిపి జిల్లా అధ్యక్షులు పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు.నియోజకవర్గ కేంద్రమైన చైతన్య సమితి ఆధ్వర్యంలో రేపల్లెకు చెందిన కంచర్ల శౌరిబాబు 7వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో శనివారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొమ్మాలపాటి శ్రీధర్ ప్రారంభించారు. వేసవికాలంలో ప్రజలు ఇంటి నుండి బయటకు రావాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ తాము చేస్తున్న కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్,75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉడుముల వెలుగొండారెడ్డి,మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు,డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ వడ్డమూడి అప్పారావు,నియోజకవర్గ తెలుగు యువత నాయకులు మక్కెనసాగర్,షేక్ నన్నేమియా షేక్ మస్తాన్ షరీఫ్ షేక్ అజ్మల్లా,జన చైతన్య సమితి ఉపాధ్యక్షులు రామిరెడ్డి, నిర్వాహకులు అన్నవరపు స్టాలిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అగతవరప్పాడులో ఉచిత ఆయుర్వేద శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

వెంకటేశ్వరా ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ పెదకాకాని మండలం, అగతవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్య బృందంతో నాడి పరీక్షించి, కీళ్ళ నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్తమా, అలర్జీలు, అధిక బరువు, చర్మ వ్యాధులు, సోరియాసిస్, ఫైల్స్, హెచ్ఐవి సంబంధిత వ్యాధులకు ఉచితంగా మందులు అందచేయటం జరుగుతుందన్నారు. కావున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

జడ్జిల నియామకాలు, బదిలీల్లో పారదర్శకత లోపించింది

- రిటైర్డ్ జడ్జి జేసురత్నకుమార్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'కంబాటింగ్ కరప్షన్ ఇన్ ది జ్యూడీషియరీ' అనే అంశంపై అడ్వకేట్లలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో అవినీతికి దారితీస్తున్న పలు అంశాలపై ప్రసంగిస్తూ జడ్జిలు నియామకాలు, బదిలీలు, కొలీజియంలోని పారదర్శకత లోపించిందని అన్నారు.ఏ వ్యవస్థలోనైనా అవినీతి నిర్మూలించటానికి, సమాజం, యువత చైతన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇదే సమావేశానికి హాజరైన రిటైర్డ్ జడ్జి ఎస్.జేసురత్నకుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ సుప్రీం కోర్టు జస్టిస్ కృష్ణ అయ్యర్ ఉటంకించిన 'జడ్జ్ ఎ జడ్జ్, ట్రయల్ ఎ కోర్ట్' మాటలను ఉటంకించారు. ఐలా స్టేట్ ప్రెసిడెంట్ జి.శాంతకుమార్ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాలలో జడ్జిల అవినీతి దుష్ప్రవర్తనలపై విచారించటానికి ఒక చట్టబద్ధమైన కమిటీ ఏర్పాటు కోసం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తులను న్యాయమూర్తుల ఎంపిక చేసుకునే విధానం అశాస్త్రీయమని అన్నారు. కింది న్యాయస్థానాలలో న్యాయమూర్తుల అవినీతిపై సక్రమంగా చర్యలు తీసుకోవటానికి యంత్రాంగం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ఐలా నగర ప్రెసిడెంట్ ఎం.ఖాలేషాబేగ్, ఐలా జిల్లా ప్రెసిడెంట్ ఎం.ఈ.గీతావాణి, ఐలా రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్, రాష్ట్ర నాయకులు జి.సురేష్, ఎ.బ్రహ్మేశ్వరరావు ప్రసంగించారు.

20న మండల, సచివాలయాల వద్ద నిరసనలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలంలోని సంగం జాగర్లమూడి ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని , కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డు ఇచ్చే విధంగా చట్ట సవరణ చేయాలని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈనెల 20వ తేదీన అన్ని మండల కేంద్రాలలోను, అన్ని సచివాలయాలు వద్ద జరిగే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మలకా శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం తెనాలి రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించి ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేసిన పనికి బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం కౌలు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉపాధి పనిలోనైనా సమయానికి కూలి అందుతుందన్న ఆశతో పనులకు వస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉపాధి హామీకి బడ్జెట్లో 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం పొగాకు, మిర్చి తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దుస్థితికి నెట్టి వేయబడుతున్నారని తెలిపారు. పేద రైతులు పొదుపు సంఘాలు ఏర్పాటు చేసుకొని రైతు మిత్ర గ్రూపుల ద్వారా బ్యాంకులలో డబ్బును పొదుపు చేసుకున్నారని వారికి లోన్లు ఇవ్వటం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద రైతులకు పొదుపు సంఘాల ద్వారా వారు దాచుకున్న డబ్బును లోన్ రూపంలో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20వ తేదీ ఆందోళన జయప్రదం చేయాలని కోరారు.



కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు, సాంబిరెడ్డి

ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి...

- అల్లూరివారిపాలెంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర
- పాల్గొన్న ఎంపిడిఓ కృష్ణకుమారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేసవి తాపం నుండి ప్రజలకు రక్షణ కల్పించడానికే స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట మండల పరిషత్ అధికారిణి టివి కఅష్ణ కుమారి అన్నారు. శనివారం నరసరావుపేట మండలం లోని అల్లూరివారిపాలెం గ్రామంలో పర్యటించిన ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 3వ శనివారం అన్ని గ్రామ పంచాయతీలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. గ్రామాల్లో ప్రజలు వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ప్రతి ఇంటి ముందు చెట్లు నాటించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను నిలువ చేసేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను, వర్మీ కంపోస్టు తయారీ షెడ్డులను పరిశీలించారు. ప్రజలు వడ దెబ్బకు గురి కాకుండా తమను తాము ఎలా కాపాడుకోవాలో వివరించారు. గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపిడిఓ ప్రారంభించారు. అనంతరం ఎస్ డబ్ల్యూ పి సి షెడ్డులో మొక్కలను నాటి, గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోపీఆర్డి పి. నాగనంద్, ఎస్బీఎం(జి) ఎం ఆర్ సి టి. అయ్యపరెడ్డి, పంచాయతీ సెక్రటరీ కె. అశోక్, గ్రామ టిడిపి నాయకులు ఉడతా రాఘవ, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపిడిఓ కృష్ణకుమారి తదితరులు



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిభంధనలను వివరిస్తున్న సీఐ

మద్యం తాగి వాహనం నడపరాదు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

మద్యం తాగి వాహనాలు నడపరాదని సీఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. శనివారం ఆటో డ్రైవర్లతో పట్టణ సీఐ ట్రాఫిక్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో హాహానాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ తలనొప్పి సమస్యగా మారిందని అన్నారు. ప్రమాదాలు నివారించాలి అంటే ఆటో డ్రైవర్ల విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాన్నారు. పరిమితి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకో కూడదు, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించ కూడదు, మరి ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదలకు కారణం అవుతున్న నేపథ్యంలో మధ్యాన్ని సేవించి వాహనం నడపరాదని సూచించారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే కేసులు పెడతామన్నారు. ప్రతి ఒక్క ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలి అనికోరారు . కార్యక్రమలో పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్య , ఎం.పవన్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నరసరావుపేటలో మినీ మహానాడు...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈనెల 19వ తేదీన నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో మినీ మహానాడు నిర్వహించనున్నట్లు టిడిపి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా నియోజకవర్గం పార్టీ నేతలు పాల్గొంటారని పేర్కొంది.

దొండ పందిళ్లను సందర్శించిన ఉద్యాన శాఖ అధికారి

ప్రజాశక్తి - చేబ్రోలు

ఈదురు గాలలు, అకాల వర్షంతో నేలకొరిగిన దొండ పందిళ్లను జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.రవీంద్రబాబు శనివారం పరిశీలించారని పొన్నూరు ఉద్యాన అధికారి పి.ఉష తెలిపారు. మండలంలో గురువారం రాత్రి కురిన వర్షానికి, బలమైన గాలులకు రైతులు నష్టపోయారు. దొండ పందిళ్ళ కింద పడిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. రవీంద్రబాబు వెంట నష్టపోయిన రైతులు కూడా ఉన్నారన్నారు. మండలంలో దాదాపు 50 ఎకరాల పైబడి దొండ పందిళ్లు పడిపోయి రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఉన్నతాధికారి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుడు జి.శివ సత్యంబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దీక్షల విరమణ

ప్రజాశక్తి - మంగళగిరి

డిపో యాజమాన్యం నిరంకుశ వైఖరితో ఉద్యోగస్తుల అక్రమ సస్పెండ్‌ను వ్యతిరేకిస్తూ మూడు రోజులుగా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారం సాయంత్రం ఫలించాయని ఏపీపీ టీడీ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. మంగళగిరి డిపో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు స్పందించిన ఆర్టీసీ డిపో యాజమాన్యం యూనియన్ నాయకులతో జరిగిన చర్చలు సఫలం అవ్వటంతో దీక్షలు విరమించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, యూనియన్ గౌరవ అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, జిల్లా నాయకులు దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరివింపజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కరీముల్లా, నాగేంద్రమ్మ, ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు మంగళగిరి డిపో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని 2వ పట్టణ పోలిస్టేషన్ పరిధిలో శనివారం సిఐ హైమరావు, ఎస్సై అశోక్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వాహనాలకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ హైమరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని చెప్పారు. పల్నాడు జిల్లా ఎస్.పి కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ ను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కఅష్ణ కిషోర్ నవచైతన్య కళామండలి బఅందం నిర్వహించింది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో కళాబఅందం రూపకాన్ని ప్రదర్శించింది. ఎయిడ్స్ వ్యాధి ఎలా సోకుతుంది, వ్యాధి నియంత్రణ చర్యలు, వ్యాధి సోకిన వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో కళామండలి బృందంతో పాటు స్థానిక సిరి మహిళా సాధికార వెల్ఫేర్ సొసైటీ బృందం పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో కళాబృందం

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి : కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. అమృత రెండో దశ పథకం ద్వారా గుంటూరుకు రూ. 362.23 కోట్ల నిధుల వినియోగంపై ఆయన అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూరులో మూడు ప్రాంతాలకు తాగునీటి సరఫరా అత్యవసరంగా కావాలన్నారు. ఈ ఏరియాలకు నీరు అందించడానికి కూటమి ప్రభుత్వం రూ. 362.23 కోట్లను విడుదల చేసిందన్నారు. గోరంట్ల పైప్ లైన్ ఏర్పాటుకు గాను అమత 2.0 నుంచి 331.10 కోట్లు, ఇతర ప్రాంతాలకు రూ.32.13 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. కష్ణా నది నుంచి అమత్ పథకం ద్వారా నేరుగా గోరంట్ల ఏరియాకు నీటి సరఫరా చేస్తామన్నారు. కష్ణానది దగ్గర నుంచి ఒక పంపింగ్ మెకానిజంతో పాటు గోరంట్ల వద్ద కూడా మరో మెకానిజం ఉంటుందన్నారు. నీటి సమస్యను భవిష్యత్తులో మరి ఎప్పటికీ తలెత్త కుండా లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణానికి, భూసేకరణకు సహకరించిన యజమానులకు కేంద్ర మంత్రి పెమ్మసాని,ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, బి. రామాంజనేయులు, మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని)తో కలిసి చెక్కుల పంపిణీ చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



స్థలాలు అప్పగించిన వారికి చెక్కులు ఇస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గ్రామ పంచాయతీ కార్యాలయము, అగతవరప్పాడు

టెండర్ ప్రకటన

ఆర్.సి. తేది: 17-05-2025.

గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, అగతవరప్పాడు అనే గ్రామపంచాయతీకి 2025-26 సం॥నకు ఈ దిగువ షెడ్యూలు చూపబడిన విధముగా క్రింద తెలిపిన సామాన్లు సప్లయ్ చేయుట, సీల్డు టెండర్లు కోరబుచున్నవి. సీల్డు టెండర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి గారిచేగానీ, వారిచే అనుమతి పొందిన వారిచేగానీ ది. 24-5-2025 మధ్యాహ్నం 12 గం.ల వరకు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 2 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు టెండరు ధరావత్తు చెల్లించి రశీదు పొంది టెండరు ఫారంనకు జతపరచవలెను. టెండరు షరతులు, ఇతర వివరాలు కార్యాలయం పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	టెండర్ వివరములు	ధరావత్తు
1.	2025-26 వ సం॥మునకు ప్రజారోగ్య సామానులు సప్లైచేయుట.	- 200
2.	2025-26 వ సం॥మునకు P.W.S. స్కీమ్ సామానులు సప్లైచేయుట.	- 200
3.	2025-26 వ సం॥మునకు విద్యుత్ విడి భాగములు సప్లైచేయుట.	- 200
4.	2025-26 వ సం॥మునకు బోరు పంపు సామాన్లు సప్లైచేయుట.	- 200
5.	2025-26 వ సం॥మునకు స్టేషనరి సామానులు సప్లైచేయుట.	- 200

స్థలము :- అగతవరప్పాడు
తేది-17-05-2025

సం॥ యం.వి.మీనాక్షి
పంచాయతీ కార్యదర్శి,
అగతవరప్పాడు గ్రామపంచాయతీ.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,అద్దంకి

O.S. No:11/2001

Between :
యర్రా అంజయ్య(Died) & 11 others ..వాదులు
And
ముట్లూరి తిరుపాలు & 28 others.... ప్రతివాదులు

To

1) ముట్లూరి జయమ్మ (24 వ ప్రతివాది)
భర్త సుబ్బయ్య, శావల్యాపురం గ్రామం మరియు మండలం, వినుకొండ.(PJCJ కోర్టు)

పై నంబరు దావాలో పైకోర్టు వారు మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకోకుండా ఇబ్బంది కలుగ చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు మీకు జారీ అగునట్లుగా పై కోర్టు వారు ఉత్తర్వులు దయచేసినారు. మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టులో తే 16-06-2025 దిన ఉదయం 10.30 గంటలకు మీరు గానీ, మీ తరపు వకీలు గానీ హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలుసుకొనేది.

వాయిదా తేది : 16-06-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి
17-05-2025

ఇట్లు
వాది తరఫు న్యాయవాది
నాదెండ్ల హరిబాబు
సెల్ నెం : 94415 21613

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

E.P. 99/2024 in O.S. 519/2022

Between :
Sanaka Vijaya Lakshmi W/o Venkata Koteswara Rao, Tenali. ..... DHR
AND
Divi Uma Lakshmi @ Uma W/o Prabhakara Rao, Tenali .... JDR

పై నెంబరు ఇ.పి.లో డిక్రీబాకీ వసూలు నిమిత్తం జెడిఆర్ స్వాధీనంలో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారిచే ది. 19-6-2025వ తేదీ ఉదయం 10-30 గం.ల లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

Property of House Flat baring No.G2 in Ground Floor having 1700 Sq.ft of Plinth area and common area and having 100 Sq.ft of Car Parking, Borewell, Common Corridor, Stair Case etc., in Rani Villas, and having 45 Sq. yards out of 405.54 Sq. yds of undivided and unspecified share in the land in ward No.8, Block No.10, T.S. No. 517/4, situated at Tenali, within the Sub-Registry of Tenali, Guntur District, is being bounded by :
East : Open to Sky
South : Open to Sky
West : Open to Sky
North : Stair Case, Lift Common Carridor.
DHR Value Rs. 20,00,000/-
Amina Value Rs. 30,00,000/-
Sale Date : 19-6-2025
Further Hearing : 26-6-2025

నోట్ : 1) ఇ.సి. దాఖలా 41/0101 కాలంప్రకారం బొల్లు ఇందిరారాణిగారి నుండి జెడిఆర్‌కు సేల్‌డీడ్ ద్వారా డాక్యుమెంట్ నెం. 2262/2022 SRO Tenali (713) న ది.27-4-2022 సంక్రమించినది. 2) ఇ.సి. దాఖలా 26, 27/0202 కాలం ప్రకారం జెడిఆర్ ది. 6-7-2022న డాక్యుమెంట్ నెం. 4068/2022 (1) SRO Tenali (713) IIFL Home Finance Ltd. Ponnuru వారికి Mortagage without possession చేసివున్నారు. 3) శ్రీ కోర్టువారు ది. 4-7-2022న జెడిఆర్‌కు దావాలో జప్తు నోటీసు ఇచ్చి ఉన్నారు. తరువాత ది. 6-7-2022న షెడ్యూలు ఆస్తిని జప్తు చేసివున్నారు. కాబట్టి సదరు Mortagage without possession డీడ్‌నకు లోబడి వుండనవసరం లేదు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

Y.Uma Maheswara Rao,
Advocate for DHR
Tenali.
Cell : 93466f51714.



కలెక్టర్‌ను కలిసిన పసుమర్రు రైతులు

పల్నాడు కలెక్టర్‌ను కలిసిన పసుమర్రు గ్రామ రైతులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చీరాల ఓడరేవు నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వరకు నిర్మిస్తున్న రహదారికి భూమిలిచ్చిన పసుమర్రు రైతులకు సరైన నష్ట పరిహారం ఇవ్వలేదని తమకు న్యాయం జరిగేలా చూడాలని రహదారికి భములిచ్చిన పలువురు రైతులు అన్నారు. గతంలో రహదారి 167-ఏ కొరకు పసుమర్రు గ్రామంలో భూసేకరణ జరిగింది. దానికి న్యాయబద్ధమైన పరిహారం అందించలేదని చిన్న, సన్న కారు రైతులు శనివారం పల్నాడు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించామని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న, సన్న కార రైతులకు పరిహారం పెంచమని జిల్లా కలెక్టర్ను కోరారు. కార్యక్రమంలో గుదే రవితేజ (హైకోర్టు లాయర్)గరికపాటి ఆదిత్య రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి, గొట్టిపాటి వాసుదేవ్ కన్వీనర్, షేక్ బాజీ షేక్ సుభాని షేక్ దరియా హుస్సేన్, షేక్ మస్తాన్‌వలి, షేక్అష్రాఫ్ ఉప్పుటూరి వెంకటరావు, ఆంజనేయులు, కారుమంచి అశోక్, చాగం టి సీతారామయ్య ఉన్నారు.



సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

59వ రోజుకు మున్సిపల్ పారిశుధ్యకార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపి మున్సి పల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 59వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్య క్షులు షేక్. సిలార్ మసూద్ మాట్లాడుతూ పరిసరాల శుభ్రతకు పాటు పడుతున్న తమ పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంభించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకునిగా ఉన్న సమయంలో తమ పోరాటాలకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు నేడు ఆ వైపు వెళుతూ మొహం చాటేస్తున్నారని సమస్య పరిష్కరించాలని అనేక మార్లు కలిసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాల గడువు పెంచండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయబోయే ఎస్‌సి కార్పొరేషన్ రుణాల మంజూరు కాలపరిమితిని పెంచాలని దళిత బహు జనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ కోరారు. శనివారం ఏపి సచివాల యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ రుణాలను ఎస్సీలకు అందజేయక పోవడం వలన ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఎక్కువ మంది ఆశావాహులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. వీలైనంత ఎక్కువ రుణాలు లబ్ధిదారులకు అందజేసేవిధంగా ప్రభుత్వం కషి చేయాలన్నారు. స్పందించిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి మాట్లాడుతూ రుణాల పరిమితి పెం చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ముఖ్యమంత్రితో, కేబినెట్ సమా వేశం లో చర్చించిన తర్వాత నూతన మార్గదర్శకాలను విడుదల చేస్తా మని చెప్పినట్లు తెలిపారు.

వర్షపు నీరు పోయేమార్గం లేక కోతకు గురౌతోన్న కరకట్ట, పొలాలు



కోతకు గురైన కరకట్ట



పొలాలకు ఎక్కని లోతులో నీటిపారుదల



చెట్టునే కుళ్లిపోయిన జామకాయలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఓగేరు వాగు రెండు పక్కల కరకట్టలకు అక్కడక్కడా భారీ స్థాయిలో గండ్లు పడటం, వాగు మధ్యలో 7-9 అడుగుల లోతున మట్టి కోతకు గురవడం, పసుమర్రు వద్ద ఉన్న బ్రిడ్జి కింద భారీగా కోతకు గురి కావడంతో పొలాలకు నీరందక పైర్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వాగులో భారీగా కోతలు పడి వ్యవసాయ మోటార్లకు కూడా నీరందక ఈ ఏడాది సపోట, జామ దిగుబడులు తగ్గుతాయని, అంతర్ పంటలుగా సాగు చేసిన అరటి, బొప్పాయి, జొన్న, మునగ, కూరగాయ మొక్కలు చనిపోతున్నాయని అంటున్నారు. తాము పొలాలకు వెళ్లడానికి మార్గం లేకుండా పోయిందని ఆందోళనకు గురవుతున్నారు. ఓగేరు నీటి పై ఆధారపడి కరకట్ట పొడవునా ఒంగోలు బ్రిడ్జి వద్ద నుంచి దండమూడి బ్రిడ్జి వరకు సుమారు 200 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. వీటిని వాగు, మురికి మురుగు నీటి సౌకర్యం ఉండటంతో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది వానలకు వాగులో ఉన్న మట్టితో పాటుగా కరకట్ట మట్టి కూడా కోతలకు గురై 9 అడుగుల లోతు వరకు పూర్తిగా మట్టి, బ్రిడ్జి కింద కొండరాళ్లు కొట్టుకు పోయాయి. వాగులోని మురుగునీరు మోటార్ల ద్వారానైనా పొలాలకు పెట్టుకునే వీలు లేకుండా నేరుగా దిగువకు వెళుతోంది. అధికారులు, ప్రజాప్రతి నిధులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానా కాలంలో భారీ స్థాయిలో కోతకు గురయ్యే అవకాశముందని హెచ్చ రిస్తున్నారు.

పైర్లు ఎండిపోయాయి



రూ.20 వేలు కౌలుచెల్లించి ఏకరంలో జామతోట సాగు చేస్తున్నాను. అంతర్ పంటగా బొ ప్పాయి, అరటి, మునగ, వంగ వేశాను. గత వర్షాకాలంలో బ్రిడ్జి కింద కొండరాళ్లు కొట్టుకు పోవ డంతో నీరు నిలవడం లేదు. దీంతో అంతర్ పంటలు ఎండిపోగా జామకు కూడా తెగుళ్ల ఆశించి దిగుబడి పూర్తిగా దెబ్బ తింది. ఇటీవల వానలకు బొప్పాయి, అరటి ఒక మాదిరిగా ఉన్నాయి. అధికారులు, నాయకులు స్పందించి పసు మర్రువాగు కిందభాగాన కట్టనుకొండరాళ్లతో బాగు చేయించాలి.

- బోయిడి సాంబశివరావు, కౌలురైతు.

కరకట్ట కోతకు గురైంది



23 ఏళ్ల నుండి 40 సెంట్లలో సపోటా తోట సాగు చేస్తున్నాను. ఇందుకు రూ.10 వేలు కౌలు అవుతోంది. కరకట్ట కోతకు గురై దెబ్బతింది. వాగు మట్టి కూడా కోతకు గురవడంతో మా పొలానికి నీరు దక్కడం లేదు. పంట చేతికి రాకున్నా కౌలు చెల్లించక తప్పడం లేదు. కరకట్టను బాగుచేసి బిడ్జి కింద దిమ్మెలకు రాళ్లతో పున: నిర్మాణం చేయాలి.

- షేక్ వలీబాబు, కౌలురైతు

పశువుల మేత కష్టంగా ఉంది

వేసవిలో పశువుల మేతకు మురుగు నీరు ఉపయోగ పడేది. ఇప్పుడు నీరు నిల్వ ఉండక పోవడంతో మేతకు కష్టంగా మారింది. కొద్దిరోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టకుంటే అనంతరం వచ్చే వర్షాల వల్ల పొలాలు కూడా కోతకు గురై నష్టమొస్తుంది.

- మస్తాన్‌వలి, పాడిరైతు

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు హ్యూమన్ రైట్స్ సొసైటీ చైర్మన్ మద్దతు



రిలే దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి రాష్ట్ర హ్యూమన్ రైట్స్ సొసైటీ చైర్మన్ (విజయవాడ) యు.జ్ఞానమ్మ దీక్ష శిబిరాన్ని సందర్శించి తన సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్మికుల పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వాలు అమలు జరపాల్సిన బాధ్యత ఉందని వెల్లడించారు. ఏసీసీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి 165వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు యూని యన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో కె.అగ్గయ్య, వై.సాంబయ్య ఎన్.సుబ్బారావు ఆర్.ఇశ్రాయేలు వి.రమణమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ 165 రోజులుగా దీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదని విమర్శించారు. ఎసిసి కార్మికులకు ఎన్నికల సందర్భంగా నారాలోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా వారి నష్టపరిహార సమస్యను పరిష్కరించాలని దుర్గారావు డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఎమ్మెల నరసింహారావు, బి.అంకయ్య, ఆశీర్వాదం, గురవయ్య, నాగేశ్వరరావు, రమాదేవి, బి.సూర్యప్రకాశరావు, ఎస్.కె.ఇమాంబి, ఎండి ఇస్మాయిల్, తుపాకుల నాగేశ్వర రావు, దుర్గభవాని, శివమ్మ, శారద, భవానీ పాల్గొన్నారు.

రాజధాని కోసం పేజ్ -2 భూ సమీకరణ గ్రామ సభలు

ప్రజాశక్తి - అమరావతి

అభివృద్ధిలో రైతును భాగస్వామ్యం చేసి ఆర్థిక ఊతమిచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం పెద్దకూరపాడు నియోజకవర్గంలో భూ సమీకరణకై అమరావతి మండలంలోని ఉంగుటూరు నరుకుల్ల పాడు గ్రామాల్లోని రైతులతో గ్రామసభలు నిర్వ హించారు. అభివృద్ధిలో 2వ దశలో వున్నామని రాజధాని 29 గ్రామాలతో సమానంగా అమరావతి మండలంలోని వైకుంటపురం, మద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, ఉంగు టూరు నరుకుల్లపాడు గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తామ్మన్నారు. రైతును కష్టపెట్టకూడదు అనేది తమ ప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. రాజధాని అభివృద్ధితోపాటు 12 గ్రామాల్లో కూడా సమాంతరంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. 29 గ్రామాల ప్రజలు సహ్రాయంతో ఆలోచించి మన రాష్ట్ర రాజధాని కొరకు వారి భూములను త్యాగం చేశారని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో పార్వతి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లాది విష్ణు, ముఖ్య నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిజాయితీ అధికారులకు అండగా నిలుస్తాం : గంగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇరువురు మున్సిపల్ ఉద్యోగుల అవినీతికి 15మంది మున్సిపల్ ఉన్నతాధికారులు, ఉద్యోగు సస్పెండ్ కావడం చిలకలూరిపేట మున్సిపల్ చరిత్రలో తొలిసారని ప్రతిపక్ష ఫ్లోర్‌లీడర్, కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పండరీపురంలోని టిడిపి ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మాజీమంత్రి విడదల రజనీ మార్గంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో గంగాభవానీ, గురు బ్రహ్మం.. లాంటి దగ్గర బంధువులను ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తించే కీలకమైన స్థానాల్లో నియమించుకుని పురపాలక సంఘానికి జమ కావలసిన ప్రజాధనాన్ని కొల్లగొడుతూ స్వంత అవసరాలకు దారి మళ్లిస్తున్నారని టిడిపి కౌన్సిలర్లను కలుపుకుని పలుమార్లు ఆనాడే మున్సిపల్ సమావేశాలలో ఆరోపించామన్నారు. ఈ విషయాన్ని పల్నాడు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గత ప్రభుత్వాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. ఆస్తుల తాకట్టుపైనా.. మున్సిపల్ ప్రభుత్వ ఆస్తులు సైతం బ్యాంకుల్లో తాకట్టు పెట్టీ అప్పుగా తీసుకున్న డబ్బులు దేనికి ఎంతెంత వాడారో..ఎవరి అకౌంట్లోకి మళ్ళించారనే విషయాలపై గతంలో ఫిర్యాదు ఇచ్చా రనీ, ఈ విషయంపై విచారణ చేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు..

బీట్ ద హీట్ థీమ్ కార్యక్రమంలో కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3వ శనివారం "బీట్ ద హీట్ థీమ్ తో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ పి అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో చెట్లు నాటి చల్లదనాన్ని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ ప్రసూన

పల్నాడు జిల్లా డిసిహెచ్‌ఎస్‌గా డాక్టర్ ప్రసూన బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నూతన డిసిహెచ్‌ఎస్‌గా డాక్టర్ ఎం. ప్రసూన శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె నరసరావుపేట కలెక్టరేట్‌లో జిల్లా పి.అరుణ్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందించే సేవలను విస్తృతం చేసేందుకు చర్యలు చేపడుతుందన్నారు.

అవినీతి చేస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టం
చైర్మన్ రఫాని

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అభివద్ధికి కట్టుబడి ఉన్నామని అవినీతి చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చైర్మన్ రఫా అని అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తన ఛాంబర్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్ట ణంలో తాగునీరు ఇబ్బందులు లేవని రెండు చెరువులలో తాగునీరు పుష్కాలంగా ఉన్నాయన్నారు. పట్టానాభివృద్ధికి మున్సిపల్ శాఖ నుంచి నిధులు మంజూరవుతున్నాయన్నారు. అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు తయారవుతున్నాయన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి జరుగకుండా చూస్తామన్నారు.

పట్టాలిచ్చారు సరే - రిజిస్ట్రేషన్లు ఎప్పుడు సార్

ప్రజాశక్తి- తాడేపల్లి

తాంబూలాలు ఇచ్చాం- తన్నుకు చావండి అన్నట్లుంది తాడేపల్లిలో పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 20000 మంది వివిధ ప్రభుత్వ స్థలాలులో సుదీర్ఘ కాలము నుండి పేదలు ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్నారు. తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ పట్టాలు పంపిణీ చేస్తామని, రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పిస్తామని టిడిపి ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. మంగళగిరి నియోజకవర్గ నుండి పోటీ చేసిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా మొదటి విడతగా 3,000 మందికి మంగళగిరి నియోజకవర్గంలో పట్టాలు పంపిణీ చేశారు. తాడేపల్లి కి సంబంధించి మహానాడు 1-473, మహానాడు2-441, డ్రైవర్ కాలనీ 119, సీతానగరం 48, సలాం హెూటల్ సెంటర్ 92, పద్మశాలీయ బజార్ 137 మొత్తం కలిపి 1310 మందికి తాడేపల్లిలో పట్టాలు పంపిణీ చేశారు. మిగతా 1690 మంగళగిరి పట్టణం మరియు మంగళగిరి రూరల్ గ్రామాల్లో పంపిణీ జరిగింది. పట్టాల పంపిణీలో కూడా చిత్ర విచిత్ర చోటుచేసుకున్నాయి. సుందరయ్య నగర్ మహానాడులో



లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలు

నివాసం ఉంటున్న గోపు నాగలక్ష్మికి 16 గజాలకు, చిప్పాడా నాగ విజయకు 20 గజాలకు పట్టాలిచ్చారు. అధికారులు ఇచ్చిన ఈ పట్టాలు చర్చనీయం అయ్యాయి. కేవలం 16 గజాలు, 20 గజాలలో బాత్రూం కూడా నిర్మాణం కాని పరిస్థితుల్లో ఇల్లు ఎలా నిర్మించుకుంటారో అధికారులే సెలవు ఇవ్వాలి. పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇస్తామని ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు బోలెడంత వ్యత్యాసం ఉందని విమర్శలు వినబడుతున్నాయి. పట్టాలి ఇచ్చిన వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుదామనే ప్రచారం కూడా మందకొడిగాన్నే సాగుతుంది. రిజిస్ట్రేషన్ కూడా 150 గజాలు లోపు ఉన్నవారికి 500 రూపాయలు ఫీజు నిర్ణయించారు. అర్హులైన వారందరికీ ఉచితంగా పట్టాలిస్తామని, చేయిస్తామని హామీ ఇచ్చి నేడు రిజిస్ట్రేషన్ కు డబ్బులు వసూలు చేయడం ఏమిటని పేదలు ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి మండలానికి సంబంధించి ఉండవల్లిలో 48 మందికి, ఇప్పటంలో ఎనిమిది మందికి మాత్రమే ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. రిజిస్ట్రేషన్ ఫీజు 500 రూపాయలు చెల్లించటానికి కూడా పేదల ముందుకు రావడం లేదు. పేదల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం రెండు సంవత్సరాల వరకు ఆ స్థలాలను అమ్ముకునే అవకాశం లేదు. ప్రభుత్వం ఈ నిబంధన చేర్చుటతో అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక 150 గజాలు పైబడి నివాస స్థలాలు ఉన్న పేదలు రిజిస్ట్రేషన్ ఫీజు పెద్ద ఎత్తున చెల్లించాల్సి వస్తుంది. సుమా 200 గజాలు స్థలం ఉంటే 150 గజాలు ఉచితం కింద తీసేయకుండా 200 గజాలకు ఫీజు చెల్లించాల్సి రావటంతో సుమారు ఐదు లక్షల నుండి ఆరు లక్షల రూపాయలు చెల్లించాలి వస్తుంది. దీనిపై కూడా పేదల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మే 20న జరిగే నిరసనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దేశవ్యాప్తంగా, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పైన మే 20వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కార్మిక సంఘాల పిలుపులో భాగంగా, ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబి భవన్లో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రైతుల నడ్డి విరిచేందుకు, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. సంవత్సర కాలం పాటు సుదీర్ఘ పోరాటం చేసిన అనేక రైతు సంఘాల పోరాట ఫలితంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తున్నామని ప్రకటన చేసిన బిజెపి కేంద్ర ప్రభుత్వం మరలా నల్ల చట్టాలు అమలు చేసేందుకు పూనుకోవటం దుర్మార్గమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని అమలు చేయకుండా, పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను మోసం చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. ఇటీవల అకాల వర్షాలు కురిసి అనేకసార్లు రైతులు పంటలు దెబ్బతిన్న స్థానికంగా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని అందించకపోవడం వ్యవసాయ రంగాన్ని రైతులను దెబ్బతీయటమేనని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు స్థానికంగా రైతులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మే 20వ తేదీన నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలో మూడు వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించే ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలవలో నేడు మురుగునీరు కలవడంతో కలుషితమై రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పంట కాలవలో కలిసి

రైతు, కార్మిక సంఘాల పిలుపు

మురుగునీరును అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా కుంచనపల్లి నుండి రేవేంద్రపాడు వరకు ఉన్న బకింగ్ హెూమ్ కాలువ వెంబడి ఉన్న రోడ్డును నిర్మాణం చేపట్టాలన్నారు. కుంచనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా వైద్యురాలని నియమించి, అన్ని రకాల పరీక్షలు నిర్వహించేలా చర్యలను అధికారులు తీసుకోవాలన్నారు. సిఐటియు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి, గఅహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన అన్నారు. విద్యుత్ సంస్కరణలో భాగంగా ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలన్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసే వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించే విధంగా ఉపాధి హామీ పథకం పనులు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించే విధంగా, కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను ఎత్తివేయాలన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని మే 20వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి

ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై త్రివిధ దళాలకు మద్దతుగా పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక చినరావూరు సత్యనారాయణ లేక్ పార్క్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధులలో కొనసాగింది. ర్యాలీలో కేంద్ర గ్రామీణాభివఅద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, కఅష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పాకిస్తాన్‌పై, ఉగ్రవాదంపై ఘన విజయం సాధించిన సందర్భంగా త్రివిధ దళ సైనికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఎన్నారై కళాశాల విద్యార్థులు, కూటమి పార్టీల నాయకులు, ఎన్‌సిసి అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ఉపాధి హామీ పథకం కూలీలు

ప్రజాశక్తి - మేడికొండూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మండల కేంద్రమైన మేడికొండూరులో ఉపాధి హామీ కూలీలను కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ శనివారం క్షేత్రస్థాయిలో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో లేని విధంగా ఈ సంవత్సరము కొత్తగా పలు రకాల నిబంధనలు అమలు చేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఆఫ్రిన్ అనే కూలి మాట్లాడుతూ ఆరు వారాల నుండి వేతనములు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇంటికి వెళ్ళేటప్పుడు ఫొటోలు తీయడంతో సర్వర్ పరికరం పని చేయక మధ్యాహ్న సమయంలో 12:30 నుండి 1 వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎండ తీవ్రతతో, వడగాలికి ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. గతంలో ఉన్నట్లు పని ప్రదేశంలో మంచినీళ్ళు అందుబాటులో పెట్టడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా బట్ల రామకఅష్ణ రామకఅష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పాలన అధికారంలోకి వచ్చినప్పటినుండి నుండి బడ్జెట్లో రూ. 2.40 వేలకోట్లు కేటాయించాల్సి ఉండగా. దానిని పూర్తిస్థాయిలో కుదించి రూ 80 వేల కోట్లు మాత్రమేకేటాయించారన్నారు. ఇందులో రోడ్ల నిర్మాణానికి,భవన నిర్మాణానికి నిధులు ఇస్తున్నారు. చట్టంలో శ్రమశక్తికి 90 శాతం నిధులు కేటాయించాలని ఉంటే ప్రస్తుతం 40 శాతం నిధులు



కూలీలతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు రామకృష్ణ

మెటీరియల్ పోతున్నాయన్నారు. దీంతో ఉపాధిహామి పనులు తగ్గుతున్నాయన్నారు. పని ప్రదేశంలో రెండుసార్లు ఫోటో విధానాన్ని రద్దు చేయాలి అన్నారు. జీవోలో ఒక్కొక్కరికి కూలి రూ 312 ఉంటే కూలీలకు మాత్రం వేతనము రూ. 220 నుండి 240 వరకే కూలిస్తున్నారని అన్నారు. రోజుకి రూ. 600 రూపాయలు వేతనంతో 200 రోజులు పని కల్పించాలని కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. పంటల గిట్టుబాటు ధరలు చట్టం చేయాలని కౌలు రైతులకు, రైతులకు రుణమాఫీ చేయాలని, రద్దుచేసిన29కార్మిక చట్టాలు పునరుద్ధరించి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఈ డిమాండ్లు సాధించేందుకు మే 20వ తేదీన అన్ని సచివాలయ వద్ద కార్మిక, కర్షక ఐక్యతతో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పాపినేని శివంకర్, ఇతర సాహితీవేత్తలు

కవితా స్రవంతి పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

అభ్యుదయ రచయితల సంఘం 90సంవత్సరాల సంబరాలలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీసు ఆర్గనైజేషన్ హాలులో నాలుగు కవితా స్రవంతి పుస్తకాల ఆవిష్కరణ చేశారు. సభకు సాహితీవేత్త భూసురుపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, దివికుమార్, మందరపు హైమావతి పాల్గన్నారు. భూసురుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకాలు కవి ఆత్మీయతను ప్రతిబింబించే విధంగా ఉన్నాయన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను నేటితరం చదవటం అవసరం అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఛాయారాజ్, ఎండ్లూరి సుధాకర్, నూతలపాటి గంగాధర్, పట్టాభిల కవిత్వాన్ని ఈ తరానికి సులభంగా చదువుకునేలా అందిస్తున్న అరసం కృషి అభినందనీయం అన్నారు. మందరపు హైమావతి, దివికుమార్, వల్లూరు శివప్రసాద్ మాట్లాడారు. అనంతరం యుద్ధం- శాంతి అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో బండికలు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర, గుడిపాటి హేమలత, ఎం.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డిఆర్ఓ, ఉద్యోగులు

చెట్లను విరివిగా నాటాలి

ప్రజాశక్తి - గుంటూరు

భూ వాతావరణంలో వేడిని తగ్గించేందుకు చెట్లును విరివిగా ాటి పచ్చదనం పెంపొందించటంతోపాటు, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కే.ఖాజావలి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జిల్లా విపత్తు నిర్వహణ ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీ కుమారితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈనెల బీట్ ది హీట్ కాన్సెప్ట్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పర్యావరణంలో అధిక వేడికి కారణమయ్యే ఏసీలను, ఎనర్జీతో పనిచేసే ఫ్యాన్లు, లైట్లు, ఇతర ఉపకరణాలు పొదుపుగా వినియోగించాలన్నారు. అనంతరం డిఆర్ఓ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, కలెక్టరేట్‌లోని సెక్షన్ సూపరిండెంట్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాయపాటి శైలజతో అమరావతి రైతు జెఎసి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రాయపాటి శైలజ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో అమరావతి రైతు జెఎసి నాయకులు ఆమెతో ఈ నెల 19న ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. 19న సాయంత్రం 7 గంటలకు శ్రీ కన్వెన్షన్,ఫేజ్ 2,ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరులో సమావేశం జరగనుంది.తుళ్లూరు, మందడం,అనంతవరం నుండి 19న సాయంత్రం 5 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, రైతులు,రైతు కార్మికులు తదితరులు ఆకుపచ్చ కండువాలతో రావాల్సిందిగా జెఎసి నాయకులు విజ్ఞప్తి చేశారు.అమరావతి ఉద్యమంలో పాల్గని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచి రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ గా భాద్యతలు చేపట్టిన శైలజకు అభినందనలు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులకు రేషన్‌కార్డులు అందేలా పని చేయండి

చౌకడిపో డీలర్లతో తహశీల్దార్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న తహశీల్దార్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - మాచర్ల

రేషన్ కార్డు అంశంలో అర్హులకు న్యాయం చేసేందుకు తమతో పాటు చౌక డిపోల డీలర్లు కూడ సమిష్టి కృషి చేయాలని తహశీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం రేషన్‌కార్డు అంశంలో మార్పులు, చేర్పుల గురించి డీలర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు సమావేశంలో తహశీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్‌కార్డు అంశంలో మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. నూతన కార్డు కోరకు, ఇప్పటికే ఉన్న కార్డులో అదనంగా కుటుంబ సభ్యుల యాడింగ్, మరణించిన, వివాహం అయిన కుటుంబ సభ్యుల తోలగింపు, యాడింగ్, ఇప్పటికే ఉన్న కార్డులను విభజన చేయటం, ఇప్పటికే ఉన్న కార్డుల్లో రాంగ్ ఆధార్ నమోదు కావటం, ఇప్పటికే ఉన్న కార్డుదారులు తమ రేషన్ కార్డును ఒక చోట నుండి మరోక చోటికి మార్చుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి జి రమణ, ఆర్‌ఐ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా ఇవ్వకపోతే చర్యలు -తహశీల్ధార్

ప్రభుత్వం సబ్సిడిపై పంపణి చేసే బియ్యం, షుగర్ ఇతరాలను సక్రమంగా పంపిణి చేయకపోతే చర్యల తప్పవని చౌకడిపో డీలర్లను తహశీల్దార్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఉదయం తహశీల్ధార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేధికలో సాక్షాత్తు ఎంఎల్‌ఎ జూల కంటి బ్రహ్మానందరెడ్డి బియ్యం తదితర సక్రమంగా ప్రజలకు పంపిణి కావటం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చినట్లు వివరించారు. తహశీల్ధార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బియ్యం తదితర సక్రమంగా పంపిణి చేయాలని, తమకు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగాల్లో చేరిన వారి పేర్లు తొలగింపుకు అవకాశం ఇప్పించాలి

ఫీజు రియంబర్స్‌మెంట్ లాంటి పథకాలతో విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధించిన వారి పేర్లు రేషన్‌కార్డుల్లో నుండి తొలగింపుకు ప్రస్తుత సమయంలో ప్రభుత్వం అవకాశం కల్పించలేదని పలువురు చౌకడిపో డీలర్లు తహశీల్దార్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకోచ్చారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్‌కార్డుల అంశంపై చౌక డిపో డీలర్లతో జరిగిన సమావేశంలో పలువురు డీలర్లు మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన వారి వలన తమ కార్డులు పోకుండా వారి పేర్లు తొలగించాలని పలువురు తమను అడుగుతున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు చేసే పిల్లలను సాకుగా చూపించి తమ రేషన్‌కార్డులను తొలగించి, ఇతర కుటుంబ సభ్యులను ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం చేయకుండా సాయం చేయాలని పలువురు కార్డుదారులు అడుగుతున్నట్లు వివరించారు. స్పందించిన తహశీల్ధార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అటువంటి వారి జాబితాను సిద్దం చేసుకుంటే ప్రభుత్వం అవకాశం ఇస్తే వారి ప్రక్రియను ముగించవచ్చునని తెలిపారు.

"బీట్ ద హీట్" కార్యక్రమంపై అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న చలివేంద్రంలో ఎమ్మెల్యే మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ సాంప్రదాయేతర శక్తి వనరుల వినియోగాన్ని పెంచు కోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి, పరిసర ప్రాంతాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని, ఆ విధానాన్ని పదిమందికి తెలియజేసి పట్టణ పురోవృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం. జశ్వంతరావు మాట్లాడు తూ ప్రజలందరూ ప్లాస్టిక్‌ను బహిష్కరించి, పర్యావరణ హిత మైన జూటు బ్యాగులు, క్లాత్ సంచులు, టిఫిన్ బాక్స్‌లను విని యోగించాలని కోరారు. కార్యక్రమంలో మున్సి పల్ ఇంజనీర్, డిఇ, ఏ.ఇ, శానిటరీ ఇన్స్‌పెక్టర్స్, టిపిఓ. ఆర్ఓ, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది, ఆర్.పిలు, సీనియర్ సిటిజన్స్, ఎన్జిఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందరావు

ప్రజాశక్తి - వినుకొండ

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆదేశాల మేరకు ప్రతినెల 03 వ శనివారము నాడు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా మే నెల మూడవ శనివారం "బీట్ ద హీట్" అనే అంశం పేరుతో అవగాహన కార్యక్రమము ర్యాలీని నిర్వహిం చారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం వడదెబ్బ నుండి వేడి గాలుల నుండి తీసుకోవలసిన జాగ్రత్తలు మున్సిపల్ కార్యాలయం వారు చేసిన ప్రత్యేక ఏర్పాట్లు గురించి వివరించారు. ఇందులో భాగంగా చలివేంద్రాల ఏర్పాటు, ముఖ్య కూడళ్లలో ప్రజలు విశ్రాంతి తీసుకొనుటకు తాత్కాలికంగా చలువ పందిరి ఏర్పాటు, పశువులకు ఇతర సాధు జంతువులకు అక్కడక్కడ మంచినీటి సౌకర్యార్థము నీటి తొట్టెలు ఏర్పాటు చేయుట, వృద్ధులకు, పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలకు వేడి గాలుల నుండి వడదెబ్బ నుండి వారిని రక్షించుకొనుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ షేక్ దస్తగిరి షకీలా, మున్సిపల్ కమిషనర్ ఎం సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. ఇస్మాయిల్, వార్డు కౌన్సిలర్స్, ఎన్జీవోలు, మెప్మా సిబ్బంది, వార్డు సెక్రటరీలు, శానిటేషన్ మేస్త్రీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.మండలంలోని కొప్పకొండ తండా సర్పంచి బికినీ బాయ్ భూక్య మంత్ర నాయక్ ఆధ్వర్యంలో మూడవ శనివారము స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల దగ్గర వేప మొక్క నాటడం, చలివేంద్రం ఏర్పాటు, ర్యాలీ,హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ హెల్త్ క్యాంపులో మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో ఎండ తీవ్రత వడగాల్పుల నుండి ఎలా కాపాడుకోవాలని గర్భిణీలు చిన్న పిల్లలు వద్దులు వయోవద్ధులు ఈ ఎండ్ల కాలం జాగ్రత్తగా ఉండాలని నీటిని ఎక్కువగా తీసుకోవాలని ఈ ఎండల నుండి పనికి వెళ్లి వచ్చిన తర్వాత ఓఆర్ఎస్ ప్యాకెట్స్ నీటిలో కలుపుకొని త్రాగాలని, నిమ్మరసము మజ్జిగ త్రాగాలని ఎండలో బయటికి వెళ్లేటప్పుడు గొడుగు వాడాలన్నారు కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఆశ వర్కర్ మహిళలు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పహాల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని భారత దేశ సైనికులకు సంఘీభావంగా సత్తెనపల్లి పట్టణంలో తిరంగా ర్యాలీని శనివారం నిర్వహించారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. పట్టణంలోని రఘురాంనగర్ టిడిపి కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ గడియారపు స్తంభం మీదుగా తాలూకా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ సైనికుల త్యాగాలు మరువలేనివని అన్నారు. మహిళ సిందూరం చెరిపిన ఉగ్రవాదులను త్రివిధదళాలు మట్టు పెట్టాయని అన్నారు. ఉగ్రవాదుల చెతిలో మరణించిన 26మంది మృతులకు నివాళులు అర్పించారు. ఆపరేషన్ సిందూర్‌లో అసువులు బాసిన అమర జవాన్ మురళీ నాయక్‌కు కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యెలినేడి రామ స్వామి నియోజకవర్గ పరిశీలకులు తాతా జయ ప్రకాష్ నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమటినేని శోభారాణి,దరువూరి నాగేశ్వరరావు, లగడపాటి గజానన, పసుపులేటి మల్లారెడ్డి జనసేన నాయకులు తవిటి భావనారాయణ, రంగిశెట్టి సుమన్, బీజేపీ నాయకులు కట్టా శంకరరావు పాల్గొన్నారు.



హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత

హెచ్ఐవిపై వీధి నాటకాల ద్వారా ప్రజలకు చైతన్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ - నియంత్రణ సంస్థ ఆదేశానుసారం హాండ్స్ ఆఫ్ కంఫాషన్ ఆధ్వర్యంలో గాయత్రి కల్చరల్ సొసైటీ నాగరాజు కళాజాత బృందంచేత వీధి నాటకాల ద్వారా హెచ్ఐవి /ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తు న్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శని వారం హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రా కుండా తీసుకోవాల్సిన జాగ్రతల పై వీధి నాటకాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవి/ ఎయిడ్స్ ఆక్ట్ - 2017 గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని హాండ్స్ ఆఫ్ కంఫాషన్ ప్రీవెన్షన్ యూనిట్ ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. ఆనంద్ బెంజిమెన్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియం త్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ - నియంత్రణ సంస్థ కళాజాతర బృందాలను ప్రారంభించి నట్లు చెప్పారు. ఐసిటిసి కౌన్సిలర్స్ రవి, ఎన్జీఓ స్టాఫ్ రజ ని, వాసవి, మీరా, మేరీ, శివరాజు, ల్యాబ్ టెక్నీషియన్స్, కళాజాత బృందం పాల్గొన్నారు.ఎన్జిఓలు పాల్గొన్నారు.



చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న చైర్మన్ శోభారాణి శ్రీనివాసరావు

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మినేని శోభారాణి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛా ఆంధ్ర కార్యక్రమంలో శనివారం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. యార్డు ఆవరణలో ఉన్న చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు టిడిపి నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వర రావు, దివ్వెల శ్రీనివాసరావు, బండారుపల్లి నరసింహారావు యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని భారతాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. భూ సమస్యలను తెలుసుకునేందుకు రైతు సంఘం నాయకులు శనివారం మండలంలో పర్యటించారు. భారతాపురం గ్రామంలో పర్యటించిన రైతు సంఘం నాయకుల దృష్టికి బస్సు సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తెచ్చారు. వినుకొండ నుండి కుమ్మరిపాలెం, తిమ్మాయపాలెం, భారతాపురం, నడిగడ్డ బస్సు సౌకర్యం లేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా రైతు సంఘం నాయకులు గోపాల్‌రావు, ముని వెంకటేశ్వర్లు, రాధాష్ణ, బొంకూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేసిన కలెక్టర్

కబడ్డీ క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

ఆంధ్ర రాష్ట్ర క్రీడా శాఖ(శాప్) వారి ఆధ్వర్యంలో 01-05-2025 నుండి 31-05-2025 వరకు అనగా నెలరోజుల పాటు జరిగే కబడ్డీ క్యాంప్ స్థానిక కారంపూడి రోడ్డులోని విద్యా వికాస్ హైస్కూల్‌లో నిర్వహించబడుతున్న సంగతి విదితమే ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు, పల్నాడు జిల్లా డీఎస్డీవో నరసింహారెడ్డి చేతులమీదుగా క్రీడాకారులకు పరికరాలను కబడ్డీ కోచ్ కోమటిగుంట శ్రీహరికి అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ కబడ్డీ క్యాంపు ద్వారా క్రీడాకారులు కబడ్డీ ఆటలో మరిన్ని మెళుకువలు నేర్చుకునే మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు.

భైరవునిపాడులో అరుదైన పురాతన విగ్రహం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మండలంలోని భైరవునిపాడు గ్రామంలో అరుదైన పురాతన విగ్రహం బయటపడింది. స్థానిక శివాలయం సమీపంలోని పొదల్లో సగం పూడ్చుబడిన 16వ శతాబ్దానికి చెందిన వీరభద్రుడి అందమైన చిన్న శిల్పం లభ్యమైందని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మున్నంగి జగన్నాధం ఇచ్చిన సమాచారం ఆధారంగా శివనాగిరెడ్డి 6 అంగుళాల పొడవు, 12 అంగుళాల ఎత్తు, 2 అంగుళాల మందం కలిగిన ఆ విగ్రహాన్ని పరిశీలించారు. వీరభద్రుడు కుడి చేతితో బాణం, కత్తి, ఎడమ చేతిలో విల్లు, డాలు పట్టుకుని ఉన్నట్లు ఈ విగ్రహాన్ని చెక్కారు. చారిత్రాత్మకంగా ప్రాముఖ్యత ఉన్న శిల్పాన్ని జాగ్రత్త చేసి, స్థానిక పాత శివాలయంలో దానిని భద్రపరిచినందుకు మున్నంగి జగన్నాధంను అభినందించారు.

తాళ్లపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - విపిసౌత్

మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పిటిసి మాజీ సభ్యులు ఎస్ గోపిరెడ్డి అన్నా రు. శుక్రవారం రాత్రి తాళ్లపల్లి గ్రామ సర్పంచిగా దేరం గుల కోటేశ్వంరావు బాధితులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో కోటేశ్వరరావుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన గోపిరెడ్డి మాట్లాడుతూ తాళ్లపల్లి గ్రామంలో సమస్యల పరిష్కారానికి కషి చేయాలని కోరారు. వార్డు సభ్యుల సూచనలు, సలహాల మేరకు గ్రామంలోని అన్ని వార్డులు పర్యటించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు మాచర్ల శాసన సభ్యులు జూల కంటి బ్రహ్మారెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్య క్రమంలో రామిశెట్టి సైదారావు, దేరంగుల హనుమంతు రావు, కొప్పునూరు సుధాకర్ రెడ్డి, దేరంగుల చిన్న నారా యణ, దేరంగుల. శ్రీను జూకూరి సత్యం, మేకల వెంకటే శ్వర్లు, కొండ హుస్సేన్ లింగయ్య, కొండ బ్రహ్మయ్య, వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.





తెనాలిలో రోడ్లు శుభ్రం చేస్తున్న మంత్రి నాదెండ్ల, చేబ్రోలులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, దుగ్గిరాలలో మొక్కలు నాటుతున్న డీపీఓ, సర్పంచ్

వేడిని ఓడించండి - ఆరోగ్యాన్ని కాపాడుకోండి

ప్రజాశక్తి - తెనాలి

వేడిని ఓడించండి - ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దేశంలో తెనాలి పురపాలక సంఘంలో తొలిసారిగా తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా సేకరించడం విశేషమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'బీట్ బి హిట్' పేరిట శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని బుర్రిపాలెం రోడ్ శివాజీ చౌక్ నుంచి రాముల వారి గుడి మీదుగా మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ వరకు, అక్కడి నుంచి చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల, కొడాలి వీరయ్య మున్సిపల్ పార్క్ మీదుగా రావి టవర్స్ వరకు మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. బండ్లమూడి వారి వీధి లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి స్వయంగా సైడ్ కాలువలోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో అందరం కలిసికట్టుగా స్వచ్ఛత కోసం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతా కలిసికట్టుగా పట్టణాన్ని, మన నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనేది ఈ - వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నినాదం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సబ్ కలెక్టర్ సంజన సింహ, మున్సిపల్ కమిషనర్ బి శేషన్న, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎసిపి కె సాంబశివరావు, అసిస్టెంట్ కమిషనర్ వి లక్ష్మీపతి, ఎంహెచ్ఓ డాక్టర్ కె హెలెన్ నిర్మల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఇన్‌చార్జి ఎంఈఎ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

బీట్ ద హిట్, సేఫ్ అండ్ హెల్దీ కార్యక్రమం శనివారం చేబ్రోలులో ఘనంగా జరిగింది. గ్రామాల్లోని ప్రధాన వీధులలో ర్యాలీలు మానవహారాలు ప్రతిజ్ఞలు చేశారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి మనోహర్

మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో ఈ కార్యక్రమాలు జరిగాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి తెలిపారు. గుండవరంలో గ్రామ సర్పంచ్ చుక్క సాయి నాగేంద్రమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి పాల్గొని మాట్లాడుతూ ఎండ తీవ్రత , వేడి ఒత్తిడి యొక్క ప్రమాద కారకాలు తప్పుకునేందుకు పాటించాల్సిన అంశాలను వివరిస్తూ వేడి తీవ్రత లేని సమయాల్లో పలచని కాటన్ దుస్తులు ధరించి పనిచేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ వెంట త్రాగునీరు ఉంచుకోవాలని, తమ పని సమయంలో ఎండ తీవ్రత లేని విధంగా చూసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొన్న వారికి చల్లని నీటిని అందించారు. రోడ్డు ప్రక్కన మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి వై.సౌజన్య, ఈవోపిఆర్‌డి టి.ఉషారాణి, ఏఈఆర్‌డబ్ల్యూఎస్ పి.శ్రీనివాసరావు, ఏపీడీ డ్వామా, ఏపీఎం శ్రీలక్ష్మి, మండల కోఆర్డినేటర్, తెదేపా మండల అధ్యక్షులు మైలా వెంకటరామరాజు ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.



మంగళగిరిలో ఎండ తీవ్రత పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కమిషనర్

ప్రజాశక్తి - దుగ్గిరాల

వేసవికాలంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందర స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని డిపిఓ బి.వి.సాయికుమార్ అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాల శనివారం జరిగిన వివిధ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక జల వనరుల శాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఎస్‌డబ్ల్యూపిసి వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రెహమాన్ వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఫ్లెక్సీని ఆవిష్కరించారు. టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు, సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్, ఇన్‌చార్జి ఎంపీడీవో జవహర్‌లాల్ నెహ్రూ, గ్రామ కార్యదర్శి వివేకానంద బాణావత్ వెంకటేశ్వర నాయక్, టీడీపీ నాయకులు గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, పర్వతినేని హర్ష, జున్ను ఖాన్, జంపాల నరేంద్ర, జోగేంద్ర ప్రసాద్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీట్ ద హీట్ అవగాహన కార్యక్రమాన్ని ఎంటిఎంసి కార్పొరేషన్ అధికారులు నిర్వహించారు. పర్యావరణ రక్షణ పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్ కె.శకుంతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలామూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సూపర్డెంట్లు నగరపాలక సంస్థ సిబ్బంది, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ ప్రతాప్‌కుమార్

బహిరంగంగా మద్యం తాగిగే చర్యలు

ప్రజాశక్తి - తాడేపల్లి

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కుమార్ మందుబాబులను హెచ్చరించారు. శనివారం మహానాడు సమీపంలోని కృష్ణానదిలోకి వెళ్లే దారిలో రోడ్డు పక్కన మద్యం సేవిస్తున్న మందుబాబులకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించి అక్కడి నుంచి పంపించి వేశారు. రోడ్డు పక్కన మద్యం తాగి ఆపై వాహనాల నడిపి ప్రమాదాలకు గురికా వద్దని మందుబాబులుకు సూచించారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - పెదకాకాని



తంగెళ్ళ మూడి గ్రామ సర్పంచ్ జిల్లెల్లమూడి కిషోర్ బాబు ఆనారోగ్యంతో శనివారం మృతిచెందారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ మరణ వార్త విని గ్రామస్తులు కన్నీరు పెడుతున్నారు.

క్షయ వ్యాధి రహిత మండలంగా కొల్లిపరకు కృషి

ప్రజాశక్తి - కొల్లిపర

ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు సైటిబి టెస్ట్ ఆరోగ్య సిబ్బంది శనివారం చేశారు. ఈ టెస్ట్ చేయడానికి ఎయిమ్స్ నుంచి జూనియర్ రెసిడెంట్ డాక్టర్ ఉత్కర్ష తివారి ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. డాక్టర్ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ ఆదేశాల మేరకు సైటీబి టెస్టులు చేస్తున్నామని, కొల్లిపర మండలాన్ని క్షయరహిత మండలముగా ఉండేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ టెస్ట్ వల్ల టిబి రాకుండా ముందుగానే ప్రివెన్సన్ థెరపీ ఇవ్వొచ్చని తెలియజేసినారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్నంగి పిహెచ్‌సి వైద్య సిబ్బంది కల్పన, ఆమని, వజిత, మస్తాన్ బి, కొల్లిపర సబ్ సెంటర్ వైద్య సిబ్బంది వేముల లక్ష్మీ, అనిత, మణెమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్ పి.కళ్యాణి ఆశా కార్యకర్తలు జయప్రద, భవాని, మల్లేశ్వరి, సుబ్బులు, పద్మ, జ్యోతి, విజయ కుమారి క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

విజయ పికిల్స్‌ను సందర్శించిన అభిరుచి కిచెన్ మంత్ర రాజు

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి ఆటోనగర్లోని విజయ పికిల్స్‌ను శనివారం ఈటీవీ అభిరుచి ఛానల్‌లో ప్రసారం అయ్యే కిచెన్ మంత్ర వంటలు తయారీ ప్రోగ్రామ్ లోని షఫ్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా పికిల్స్ అధినేత కాటూరి రాము సంస్థలో ఊరగాయ పచ్చళ్ళు, కారంపొడిలు, మసాలాలు తయారీ విధానాన్ని ఆయనకు వివరించారు. సంస్థలో తయారయ్యే రకరకాల పచ్చళ్ల వివరాలను రాజు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజు మాట్లాడారు. విజయ పికిల్స్‌లో ఊరగాయ పచ్చళ్ళు తయారీ విధానం చాలా బాగుందన్నారు. అనంతరం సంస్థ యజమాని రాము, రాజును శాలువాతో సత్కరించి ఊరగాయ పచ్చళ్ళు అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రక్తపోటును అశ్రద్ధ చేయవద్దు

ప్రజాశక్తి - దుగ్గిరాల

క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకుని రక్తపోటును నియంత్రణలో ఉంచుకున్నట్లయితే ప్రాణాంతక రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించి వచ్చునని స్థానిక పిఎసి వైద్యాధికారి ఇజాస్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటును అశ్రద్ధ చేయవద్దు అని సలహానిచ్చారు. ప్రతి గ్రామంలో పీహెచ్సీ లేదా పీహెచ్సీ సబ్ సెంటర్ ఉన్నాయని బీపీ పరీక్ష చేసి 30 రోజులకు సరిపడే మందులు ఉచితంగా ఇస్తారని ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ప్రాణాంతక రోగాల పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది వి శ్రీనివాసరావు విజయ శ్యామల మంజుల ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

వైద్యాధికారులు, సిబ్బంది తుళ్లూరులో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అధిక రక్తపోటు చాపకింద నీరులా వ్యాపిస్తూ హార్ట్ స్ట్రోక్‌కు దారితీస్తోందని అన్నారు. ర్యాలీలో సిహెచ్ఓ వెంకట రమణ, సూపర్ వైజర్లు ఎన్.సుధాకర్, కె.నరసింహా రావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్.కె.కరీమ్, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొల్లిపరలో సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రపంచ బీపీ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రమైన కొలిపర్లు కొల్లిపర ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో ప్రతి మనిషి తన ఆహారపు అలవాట్లు శారీరక వ్యాయామం లోపం పని ఒత్తిడి నిద్రలేమి పోషకాహార లోపం ఒత్తిడికి గురవటం లాంటి వాటి వలన బీపీ వస్తుందని, బిపి వలన ఒక్కొక్కసారి ప్రాణాపాయం సంభవించవచ్చునని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం లక్ష్మి కల్పన, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి వి.నాగేశ్వరరావును యాజమాన్యం ఏకపక్షంగా అన్యాయంగా సస్పెన్షన్ చేయటాన్ని నిరసిస్తూ చేపట్టిన దీక్షలు శనివారం మూడో రోజుకు చేరాయి. ఏపీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, రీజనల్ కమిటీ మెంబర్ పులి సత్యనారాయణలు ప్రారంభించారు. దీక్షలో కె.వీరయ్య, ఎస్.రాయప్ప, యు.ఇస్సాకు, ఎం.వి.కుమార్, కె.ఎస్.లింగయ్య, టి.ఎస్.రావు, కె.ఎస్.ఎస్. రావు కూర్చున్నారు.

20న తుళ్లూరులో 'మినీ జాబ్ మేళా'

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 20న 'మినీ జాబ్ మేళా' నిర్వహించనున్నారు. మినీ జాబ్ మేళా ద్వారా 500కి పైగా ఉద్యోగాల భర్తీ అయ్యే వీలుంది. ప్రభుత్వ నైపుణ్యాభివఅద్ధి అండ్ శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సిఆర్‌డిఎ సౌజన్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు.

ఉర్దూ పోస్టులను యధావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉర్దూ పోస్టులను కొనసాగించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , సయ్యద్ ముష్తాఖ్ హుస్సేన్ లు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 తెలుగు, ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో సుమారు 50 సంవత్సరాలు పైబడి కొనసాగుతున్న ఉర్దూ ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్‌లో చూపించటం సరికాదన్నారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తితో సంబంధం లేకుండా గత ఐదు దశాబ్దాలుగా వస్తున్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను రాత్రికి రాత్రి జీఓలు తెచ్చి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఆ పోస్టులన్నీ కొనసాగుతున్నాయని, ఆ పోస్టులన్నీ యధావిధిగా కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేనివిధంగా అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలలో 30 ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలను డీగ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలలుగా మార్చేసారని, వెంటనే ఆ పాఠశాలన్నింటినీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండో అధికార భాషగా ఉన్న ఉర్దూను ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాల్సిన సమయంలో ఉన్న ఉర్దూ భాష పోస్టులు కూడా తీసేసి మైనార్టీ విద్యార్థులకు తమ మాతభాష అందకుండా చేస్తున్నారని , ఇది ఎంత మాత్రం మంచిది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ధరంసోత్ భూపాల్ నాయక్‌కు పిహెచ్‌డి పట్టా అందించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. భూపాల్ నాయక్ 'ఫెడరేటెడ్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రైవసీ, సెక్యూరిటీ అండ్ ట్రస్ట్ ఇన్ వెహికులర్ నెట్‌వర్క్స్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారన్నారు. ఈయనకు విజ్ఞాన్ యూనివర్సిటీలోని అడ్వాన్స్డ్ సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ దొండేటి వెంకటేశులు గైడ్‌గా వ్యవహరించారన్నారు భూపాల్ నాయక్‌ను వీసీ, డీన్‌లు, అధిపతులు అభినందించారు.



భూపాల్ నాయక్‌ను అభినందిస్తున్న వీసీ, డీన్‌లు



గ్యాస్ ఆధారిత దహనవాటిక, ఫ్రీజర్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్

స్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పిస్తాము

గ్యాస్ ఆధారిత దహనవాటిక, ఫ్రీజర్ రూమ్‌ను ప్రారంభించిన మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

మహాప్రస్థాన సేవాసమితి స్ఫూర్తితో గుంటూరు నగరంలోని స్మశాన వాటికలను మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం బొంగరాలబీడులోని నగరపాలక సంస్థ హిందూ స్మశానవాటికలో నూతనంగా నిర్మించిన గ్యాస్ ఆధారిత దహనవాటికను, ఫ్రీజర్ రూమ్‌ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మహాప్రస్తానం సేవాసమితి సభ్యులతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మహాప్రస్థాన సేవాసమితి రాష్ట్రంలోనే తొలిసారి స్తంబాలగరువు స్మశాన వాటికలో ఆధునిక వసతులతో ఆహ్లాదకరంగా అభివృద్ధి చేశారని, అదేస్ఫూర్తితో నగర పాలకసంస్థ నిధులు దాతల సహకారంతో బొంగరాలబీడు స్మశాన వాటికలో కూడా ఆధునిక వసతులు కల్పించారన్నారు. హైదరాబాదు, కేరళలో పలు నగరాల్లో సమితి సభ్యులు పర్యటించి, గ్యాస్ ఆధారిత దహన వాటిక ఏర్పాటుకు కషి చేశారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో దశల వారీగా అన్నీ స్మశానాలను అభివద్ధి చేస్తామన్నారు. శ్మశాన వాటికలోకి రావాలి అంటే తటపటాయించే పరిస్థితుల్లో మహాప్రస్తానం సేవాసమితి పార్కుల కంటే మిన్నగా అభివద్ధి చేస్తూ ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారన్నారు. బొంగరాలబీడులో నగర పాలకసంస్థ నుండి రూ.99.50 లక్షలు 14 ఆర్థిక సంఘం నిధులు, సేవాసమితి దాతల ద్వారా సేకరించిన నిధులతో రాజమండ్రి తరువాత గుంటూరులోనే గ్యాస్ ఆధారిత దహనవాటికను ఆధునిక వసతులతో ఏర్పాటు చేశారన్నారు. గుంటూరు నగరంలో మహాప్రస్తానం చేస్తున్న కషికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్.ఈ నాగమల్లేశ్వరరావు, సిటీప్లానర్ రాంబాబు, యం.హెచ్.ఓ డాక్టర్ రవిబాబు, ఈ.ఈ సుందరరామిరెడ్డి, మహాప్రస్తాన సేవా సమితి సభ్యులు వై.లక్ష్మణరావు, వై.అంకమ్మచౌదరి, యల్. విజయసారధి, కె. రమణయ్య, వై. నాగేశ్వరరావు, కే. మాలకొండయ్య, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం కనుసన్నల్లో భూముల రీ సర్వే

వీక్షణం

ప్రజల భూములకు సంబంధించిన భద్రతకు భరోసా లేకుండా డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగింపునకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. గుంటూరులో దాదాపు రూ.కోటి వరకు వెచ్చించి సర్వే-రీ సర్వేపేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్కు షాపులో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర అధికారులు గత ప్రభుత్వంలో నిర్వహించిన సర్వే వివరాలను ఏకరవు పెట్టారు. ప్రజలకు సంబంధించిన భూ హక్కుల పత్రాలు ఇచ్చేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ గత ప్రభుత్వ హయంలోనే ప్రారంభం అయింది. అయితే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు పేరుతో చేసిన తప్పిదాల వల్ల ప్రజల్లో అభద్రతా భావం ఏర్పడి చివరికి వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ చట్టాన్ని రద్దుచేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో చట్టాన్ని రద్దు చేసినా మరో రూపంలో సర్వే-రీ సర్వేకు పూనుకుంది. గత ప్రభుత్వం చేపట్టిన సర్వేను స్వల్పమార్పులతో యథాతథంగా చేసేందుకు కాలపరిమితిని పొడించారు. మండలానికి ఒక గ్రామం చొప్పున దాదాపు 150 రోజుల పాటు సర్వే చేసిపూర్తి వివరాలతో నివేదికలు తయారు చేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఇవ్వాలని నిర్ణయించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భూ వనరుల విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునీకరణలో భాగంగా సర్వే, రీసర్వే చేపడుతున్నారు. ఇప్పటికీ 90 శాతం భూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. ప్రధానంగా సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేపట్టారు. భూముల రీసర్వే ద్వారా కేవలం భూమిని కొలవడం మాత్రమే కాదు - విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నామని, చారిత్రక భూ వివాదాలను పరిష్కరిస్తున్నామన్నాని రెవెన్యూ మంత్రి తెలిపారు. అయితే గత పాలకులు 6,688 గ్రామాలలో అస్తవ్యస్తంగా రీ సర్వే చేసినట్లు గుర్తించామని ఇందుకు సంబంధించిన 2.85 లక్షల ఫిర్యాదులను కూడా పరిష్కరించామని మంత్రి అనగాని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ హక్కుల రికార్డులు పారదర్శకంగా, ఖచ్చితత్వంగా రూపొందించాలని అదేశించారన్నారు. భూ యజమానుల నిర్ధారణకు గతంలో ఉన్న మార్గదర్శకాలలో స్వల్ప మార్పులు చేశారు. అభ్యంతరాలు ఉంటే అప్పీలు అథారిటీని మాత్రం మార్చారు. గత ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో అప్పీలు అథారిటీని నియమించుకునే విధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రూపొందించింది. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపంది. దీని వల్ల ప్రజల భూముల భద్రతకు భరోసా ఉండదని ప్రతిపక్షాలు అప్పట్లో దుమ్మెత్తిపోశాయి.గత ఎన్నికల్లో ఈ అంశం ఎన్నికల్లో కీలకంగా మారింది. ప్రజల భూములను వైసిపి వారు లాగేసుకుంటారని, అందువల్లే పాసు పుస్తకాలపైన, సరిహద్దురాళ్లపై అప్పటి సిఎం ఫోటో వేశారని కూటమి పార్టీలు విస్తృతంగా ప్రచారం చేశాయి. తద్వారా వైసిపి ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని రద్దు చేసినా భూ హక్కుల నిర్ధారణ పేరుతో సర్వే కొనసాగిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఈ డిజిటలైజేషన్ వల్ల రైతులకు ఎంత వరకు భద్రత ఉంటుందన్నదీ ప్రశ్నార్ధకమే. ఇప్పటికే కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయ భూములపై కన్నేశాయని అందులో భాగమే ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక రైతులు, సరైన రుణ పరపతి లేక కౌలు రైతులు సాగుపై విముఖత చూపుతున్న నేపథ్యంలో భూముల వివరాలన్నీ డిజిటలైజేషన్ ద్వారా కేంద్రం కార్పొరేట్ సంస్థలకు అప్పగించనుందనే వాదన రైతు సంఘాల నుంచి విన్పిస్తుంది. కార్పొరేట్ వ్యవసాయంను ప్రోత్సహించేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టారని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె. అజయ్‌కుమార్ ఆరోపించారు.

(ఎ.వి.డి.శర్మ)

గుంటూరులో తిరంగా యాత్ర

సైనికులకు కూటమి పార్టీల సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలను మట్టు పెట్టడమే కాకుండా దేశ ప్రజలకు భద్రతలపై భరోసా కల్పిస్తూ భారత సైన్యం చేసిన కృషి అభినందిస్తూ సైనికులకు సంఘీభావంగా టిడిపి కూటమి ఆధ్వర్యంలో తిరంగా యాత్ర శనివారం గుంటూరులో జరిగింది. టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్ హిందూ కాలేజీ నుండి, ఎసి కాలేజ్ , శంకర విలాస్ బ్రిడ్జి మీదుగా లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర జరిగింది. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ హజరు అయ్యారు. వివిధ కళాశాలల విద్యార్థులు విద్యార్థినులు 75 మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూనారు. అదేవిదంగా మాజీ సైనిక ఉద్యోగి తోట శ్రీనివాస్ మాజీ సైనికులు తిరంగా ర్యాలీకి సంఘీభావం తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉగ్రదాడులతో భారత్‌ను భయపెట్టాలని చూశారని కానీ భారత సైన్యం తగిన రీతిలో గుణపాఠం చెప్పిందన్నారు. ఆయుధాలతో కాకుండా ఆత్మస్థైర్యంతో సైన్యం విజయం సాధించిందన్నారు. భారతదేశ ఐక్యత, అభివద్ధిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదుల కుట్ర పన్నారని ప్రధాని ఉక్కు సంకల్పంతో అప్రమత్తంగా వ్యవహరించారని తెలిపారు. పౌరులకు ఇబ్బంది కలగకుండా ఉగ్రవాదుల స్థావరాల మీదనే సైన్యం దాడులు చేసిందన్నారు. ఉగ్రవాదులు, వారికి మద్దతుగా నిలిచే వారిని సైనికులు కోలుకోలేని దెబ్బ తీశారని తెలిపారు. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి ఉగ్రవాదంపై తిరుగులేని విజయం సాధించామన్నారు. యుద్ధం అభివద్ధికి ఆటంకం కాబట్టి దేశ విశాల ప్రయోజనాల దష్ట్యా మోదీ సరైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు నశీర్, బి.రామాంజనేయులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస యాదవ్, డాక్టర్ శనక్కాయల అరుణ, బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్,బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు జూపూడి రంగరాజు, నాయకులు నూకల మధుకర్ జీ, బిట్ర వెంకట శివన్నారాయణ, యడ్లపాటి స్వరూపరాణి, కొత్తూరి వెంకట సుబ్బారావు, కొక్కెర శ్రీనివాస యాదవ్, పాలపాటి రవికుమార్, నేరళ్ళ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రొడిజి విద్యాలయ్‌లో ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

బుడంపాడులోని ప్రొడిజి విద్యాలయ్‌లో నిర్వహించిన వేసవి స్పార్క్ శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డిఎస్పీపి డి.ఏడుకొండలు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీయటానికి సమ్మర్ క్యాంప్ ద్వారా కృషి చేయటం అభినందనీయం అన్నారు. నూతనంగా నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టును క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వేసవి శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఎం.సూర్యకుమారి, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి ప్రసంగించారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు